సాక్షి
జగిత్యాల
గురువారం । 29 । ఫిబ్రవరి । 2024

మధుర 'జ్ఞాపకం-29'

భూమి సూర్యుని చుట్టూ తిరగడానికి 365 రోజుల 5 గంటల 49 నిమిషాల 12 సెకండ్లు పడుతుంది. అంటే 365 రోజులతో పాటు మరోపావు రోజు అవుతుందన్నమాట. పావు రోజును లెక్కలోకి తీసుకోలేం కాబట్టి.. నాలుగేళ్లలో నాలుగు పావురోజుల్ని కలిపితే ఒక రోజు అవుతుంది. ఆ ఏడాదినే లీప్ ఇయర్‌గా పిలుస్తాం. ఈ ప్రక్రియ అంతా ఫిబ్రవరి నెలలో పూర్తవుతుంది. అంటే ఆ నెలలో 28కి బదులు 29 రోజులు వస్తాయి. ప్రతీ నాలుగేళ్లకోసారి వచ్చే ఈ సంవత్సరం ఫిబ్రవరిలో 29 రోజులుంటాయి. ఈరోజు పుట్టిన వారిని లీప్లింగ్స్ లేదా లీపర్స్ అని పిలుస్తారు. ఇదేరోజు పుట్టినవారు, పెళ్లి చేసుకున్న వారు బర్త్‌డే.. వెడ్డింగ్ యానివర్సరీ జరుపుకునేందుకు నాలుగేళ్లు ఎదురు చూస్తారు. గురువారం లీప్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.. పలువురి అభిప్రాయాలు...

-8లో..



న్యూస్‌రీల్

షుగర్ ఫ్యాక్టరీని కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరిస్తుంది



ఫ్యాక్టరీ వద్ద రైతులతో నారాయణరెడ్డి

మల్లాపూర్: నిజాం షుగర్ ఫ్యాక్టరీని కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరిస్తుందన్న నమ్మకముందని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి అన్నారు. ముత్యంపేట శివారులోని నిజాం షుగర్ ఫ్యాక్టరీని చెరుకు రైతులతో కలిసి బుధవారం సందర్శించారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, కోరుట్ల కాంగ్రెస్ ఇన్‌చార్జీ జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఫ్యాక్టరీలను ప్రారంభించేందుకు ప్రభుత్వం పునరుద్ధరణ కమిటీ ఏర్పాటు చేయడం.. కమిటీ బృందం మార్చి 5న ఫ్యాక్టరీ సందర్శనకు రానున్నారని, దీంతో పూర్తి విశ్వాసం ఏర్పడుతోందని పేర్కొన్నారు. సీడీసీ మాజీ చైర్మన్ కంది బుచ్చిరెడ్డి, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, చెరుకు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్లు న్యావనంది లింబారెడ్డి, దోడ బాపురెడ్డి, కొత్తపల్లి రాజరెడ్డి, కార్మిక నాయకులు గోరుమంతుల ప్రవీణ్‌కుమార్, దామ రాజేష్, సోమిడి మహేందర్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి తెప్పోత్సవం



తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేటలో శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి తెప్పోత్సం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఓన సత్తెమ్మ, మాజీ సర్పంచ్ వనతడుపుల నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు నిలిపివేయించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

జగిత్యాలరూరల్: జగిత్యాల మీదుగా వెళ్తున్న ఎన్‌హెచ్-63కి అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు భూసేకరణను నిలిపివేయించాలని జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట, గోపాల్‌రావుపేట రైతులు బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. గతంలో సర్వే చేసి సేకరించిన భూములు కాకుండా మళ్లీ మార్పు చేశారని, దీంతో భూమిపై అధారపడిన రైతులందరూ ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పాత సర్వే ప్రకారమే బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు.

జిల్లాలో పలువురు సీఐల బదిలీ

జగిత్యాలక్రైం: జిల్లాలోని పలువురు సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ ఏవీ.రంగనాథన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మల్టీజోన్-1 పరిధిలో 65 మంది సీఐలు బదిలీ కాగా.. రామగుండం ఐటీ సీఐ సూరం వేణుగోపాల్ జగిత్యాల టౌన్ సీఐగా, ఏసీబీ సీఐ నీలం రవిని మల్యాల సీఐగా, మల్యాల సీఐ పి.దామోదర్ రెడ్డిని ఐజీ మల్టీజోన్-1 ఆఫీస్‌కు, కోరుట్ల సీఐ మద్దినేని ప్రవీణ్‌కుమార్‌ను మల్టీజోన్-1 ఐజీ ఆఫీస్‌కు బదిలీ చేశారు. ఐజీ కార్యాలయంలో వెయింటింగ్‌లో ఉన్న బి.సురేష్‌బాబును కోరుట్లకు బదిలీ చేశారు.

స్పోర్ట్స్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాలటౌన్: స్పోర్ట్స్ అకాడమీ బోయిన్‌పల్లి హైదరాబాద్, మోడల్ స్పోర్ట్స్ పాఠశాల జాతర్ల బాలుర (ఆదిలాబాద్), కిన్నెరసాని బాలుర (కొత్తగూడెం) ఉట్నూర్ బాలుర(ఆదిలాబాద్), కొత్తగూడ బాలుర(మహబూబాబాద్) ఆసిఫాబాద్ బాలికలు (ఆసిఫాబాద్), కాచనపల్లి బాలికలు (కొత్తగూడెం) పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశాలకు జిల్లాలోని గిరిజన బాలబాలికల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. 31-08-2024 నాటికి తొమ్మిది నుంచి 11ఏళ్ల లోపు వయస్సున్న బాలబాలికలు అర్హులు. వచ్చేనెల 4 నుంచి ఆరో తేదీ వరకు జిల్లా స్థాయి కమిటీ ద్వారా దేహదారుఢ్య పరీక్షలతో ఎంపిక ఉంటుందని, వివరాలకు 90591 75379నంబరులో సంప్రదించాలని గిరిజనాభివృద్ధి అధికారి తెలిపారు.

అనూహ్యంగా గట్టెక్కిన బీఆర్‌ఎస్ 'రెబల్'

- కాంగ్రెస్, బీజేపీ మద్దతుతో జగిత్యాల చైర్‌పర్సన్‌గా అడవాల జ్యోతి
- ఎన్నిక ప్రక్రియలో అనేక మలుపులు
- కాంగ్రెస్ గూటికి కొత్త చైర్‌పర్సన్..!?



ఎన్నికల అధికారి గౌతంరెడ్డి



నూతన చైర్‌పర్సన్ అడవాల జ్యోతితో కలిసి విజయ సంకేతం చూపుతున్న కౌన్సిలర్లు

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా 38వ వార్డు కౌన్సిలర్ అడవాల జ్యోతి అనూహ్యంగా ఎన్నికయ్యారు. ఏడాది క్రితం వరకు చైర్‌పర్సన్‌గా కొనసాగిన బోగ శ్రావణి అనివార్య కారణాలతో కౌన్సిలర్ పదవితోపాటు చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో చైర్‌పర్సన్ ఎన్నిక అనివార్యమైంది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాల్టీల్లో కౌన్సిలర్ స్థానాలు పదిశాతం ఖాళీగా ఉన్నా.. చైర్‌పర్సన్ ఎన్నిక జరుపుకోవచ్చని సర్క్యులర్ జారీ చేయడంతో జగిత్యాల చైర్‌పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. బుధవారం చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ చేపట్టారు.

మెజార్టీ కౌన్సిలర్లు ఉన్నా..

జగిత్యాల మున్సిపాల్టీలో మొత్తం 48 కౌన్సిలర్ స్థానాలు ఉన్నాయి. బోగ శ్రావణి రాజీనామాతో ఆ సంఖ్య 47కు చేరింది. 2020 జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి 30 మంది, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, బీజేపీ నుంచి ముగ్గురు, స్వతంత్రులు ఆరుగురు, ఏఐఎఫ్‌బీ, ఎంఐఎం ఒక్కో స్థానంలో గెలుపొందాయి. మెజార్టీ స్థానాలున్న బీఆర్‌ఎస్ నుంచి అప్పుడు బోగ శ్రావణికి అవకాశం దక్కింది. ఆమె రాజీనామాతో మళ్లీ చైర్‌పర్సన్ స్థానానికి బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు సమిండ్ల వాణి, అడవాల జ్యోతి, పల్లపు రేణుక పోటీపడ్డారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లతో మీటింగ్ ఏర్పాటు చేసి చర్చల అనంతరం కౌన్సిలర్ సమిండ్ల వాణిని చైర్‌పర్సన్‌గా ఎన్నుకోవాలని నిర్ణయించారు. అప్పటి నుంచి బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు 19 మంది క్యాంపునకు వెళ్లారు.

రెబెల్ కౌన్సిలర్ల రాజకీయం..

మెజార్టీ కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌కు ఉండడం.. 19మంది కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లడంతో కౌన్సిలర్ సమిండ్ల వాణి గెలుపుపై ధీమా నెలకొంది. ఇంతలోనే అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. బీఆర్‌ఎస్ నుంచి చైర్‌పర్సన్‌కు పదవికి పోటీపడిన కౌన్సిలర్లు అడవాల జ్యోతి, పల్లపు రేణుక క్యాంపునకు వెళ్లలేదు. వీరిద్దరూ ఒక జట్టుగా మారి బీఆర్‌ఎస్‌లోనే తిరుగుబాటు రాజకీయాలకు తెరతీశారు. అడవాల జ్యోతిని చైర్‌పర్సన్‌గా ఎన్నుకునేందుకు బీఆర్‌ఎస్‌కు చెందిన మరో తొమ్మిది మంది కౌన్సిలర్ల మద్దతు కూడగట్టారు. ఈ తొమ్మిది మందితోపాటు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆరుగురు, బీజేపీ కౌన్సిలర్లు ఇద్దరు, స్వతంత్రులు ఐదుగురు, ఏఐఎఫ్‌బీ, ఎంఐఎం కౌన్సిలర్లు ఇద్దరి మద్దతు తీసుకున్నారు. ఈ లెక్కన మొత్తం 24 మంది కౌన్సిలర్ల మద్దతుతో చైర్‌పర్సన్ పదవికి పోటీపడిన అడవాల జ్యోతి ఎన్నికయ్యారు. చైర్‌పర్సన్ ఎన్నికల్లో మొత్తం 46 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హాజరయ్యారు. మిగిలిన ఒక కౌన్సిలర్ విదేశాలకు వెళ్లడంతో హాజరు కాలేదు.

అనూహ్యం

జెడ్పీ సీఈవో, ఎన్నికల అధికారి గౌతంరెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించారు. చైర్‌పర్సన్‌గా కౌన్సిలర్లు సమిండ్ల వాణి, అడవాల జ్యోతి పోటీలో ఉన్నారు. సమిండ్ల వాణిని కౌన్సిలర్లు శివకేసరి బాబు ప్రతిపాదించగా.. గోలీ శ్రీనివాస్ బలపరిచారు. అడవాల జ్యోతిని కౌన్సిలర్ పల్లపు రేణుక ప్రతిపాదించగా.. కౌన్సిలర్ గుగ్గిల్ల హరీశ్ బలపరిచారు. అనంతరం ఎన్నికల నిర్వహించగా అడవాల జ్యోతికి అనుకూలంగా 24 మంది కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. సమిండ్ల వాణికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఓటుతో కలిపి 23 మంది మద్దతు తెలిపారు. దీంతో ఎన్నికల అధికారి గౌతంరెడ్డి అడవాల జ్యోతి చైర్‌పర్సన్‌గా ఎన్నికైనట్లు ప్రకటించారు.

కాంగ్రెస్ గూటికి అడవాల జ్యోతి..?

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన అడవాల జ్యోతి తనకు మద్దతు ఇచ్చిన కౌన్సిలర్లతో కలిసి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నివాసానికి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఆయన అందుబాటులో లేకపోవడంతో అక్కడే ఉన్న పలువురు కాంగ్రెస్ నాయకులు జ్యోతిని అభినందించారు. ఎమ్మెల్సీకి ఇంటికి చైర్‌పర్సన్ వెళ్లడంతో ఆమె కాంగ్రెస్‌లో చేరుతారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

బీఆర్‌ఎస్‌కు షాక్..

మెజార్టీ ఉన్నప్పటికీ.. సొంత పార్టీ కౌన్సిలర్లు విప్‌ను ధిక్కరించి వ్యవహరించడంతో బీఆర్‌ఎస్ నాయకులు షాక్ గురయ్యారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో మున్సిపల్ సమావేశ మందిరం నుంచి మౌనంగా బయటకు వెళ్లిపోయారు.

భారీ పోలీసు బందోబస్తు

చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐ ఆరీఫ్ అలీఖాన్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ కౌన్సిలర్లను మినహాయించి ఎవరినీ సమావేశ మందిరంలోకి రానివ్వలేదు.

ఉత్కంఠలో పతులు

మున్సిపాలిటీలో సగం మంది కౌన్సిలర్లు మహిళలే కావడంతో చైర్‌పర్సన్ ఎన్నిక సమయంలో వారి భర్తలు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో తీవ్ర ఉత్కంఠతో సుమారు ఐదు గంటల కాలం గడిపారు.

విప్ ధిక్కరించిన కౌన్సిలర్లు

బీఆర్‌ఎస్ కౌన్సిలరు 30 మంది కౌన్సిలర్ సమిండ్ల వాణికి మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ విప్ జారీ చేశారు. అయినప్పటికీ తొమ్మిది మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అడవాల జ్యోతికి మద్దతు తెలిపారు. జ్యోతికి మద్దతు తెలిపిన వారిలో బీఆర్‌ఎస్ క్యాంపునకు వెళ్లిన ఓ కౌన్సిలర్ ఉండటం గమనార్హం. విప్‌ను ధిక్కరించిన కౌన్సిలర్లపై వేటు ఉంటుందన్న ప్రచారం జరుగుతోంది. మరోవైపు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికలో పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారాయన్న చర్చ కూడా మున్సిపల్ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

విప్ ధిక్కరించిన వారిని కాపాడొద్దు

జగిత్యాల: బీఆర్‌ఎస్ పార్టీ విప్‌ను ధిక్కరించిన కౌన్సిలర్లను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కాపాడే ప్రయత్నం చేయొద్దని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. చైర్‌పర్సన్ ఎన్నిక విషయంలో పార్టీ తరపున 29 మందికి విప్ జారీ చేశామని, 9మంది పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేశారని తెలిపారు. జీవన్‌రెడ్డికి ఎన్టీఆర్‌ను గద్దె దించిన చరిత్ర ఉన్న నేపథ్యంలో ఇప్పుడు విప్ ధిక్కరించిన వారిని కాపాడే ప్రయత్నం చేయొద్దని సూచించారు. ఆయన వెంట పార్టీ పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్, వైస్ చైర్మన్ గోలీ శ్రీనివాస్, సమిండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

చైర్‌పర్సన్ ఎన్నిక రద్దు చేయండి

జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక రద్దు చేయాలని ఎమ్మెల్యే సంజయ్ కలెక్టర్ యాస్మిన్ బాషాకు ఫిర్యాదు చేశారు. విప్ ధిక్కరించిన వారిపై అనర్హత వేటు వేయాలన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన చైర్‌పర్సన్

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన అడువాల జ్యోతి, మరి కొందరు కౌన్సిలర్లు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

అదనపు కలెక్టర్‌గా రాంబాబు

- అదనపు కలెక్టర్ బీఎస్.లత బదిలీ



రాంబాబు



మధుసూదన్

జగిత్యాల: జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్.లత హన్మకొండ అదనపు కలెక్టర్‌గా బుధవారం బదిలీ అయ్యారు. ఆమెస్థానంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న పర్స రాంబాబు నియమితులయ్యారు. జగిత్యాల ఆర్డీవోగా పనిచేస్తున్న నర్సింహామూర్తి తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వేములవాడ నుంచి పులి మధుసూదన్‌ను ఇక్కడకు బదిలీ చేశారు.

కోరుట్ల ఆర్డీవో బదిలీ

కోరుట్ల: కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్‌ను వేములవాడకు బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్‌కు ఇక్కడ ఆర్డీవోగా పోస్టింగ్ ఇచ్చారు.

బీర్‌పూర్ జాతరకు తరలివస్తున్న భక్త జనం



బీర్‌పూర్‌లోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలో కిక్కిరిసిన భక్త జనం

- భక్తులతో నిండిపోయిన ఆలయ పరిసరాలు
- నేడు స్వామివారి రథోత్సవం

సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ పరిసరాలు, జాతర స్థలం భక్తులతో నిండిపోయింది. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి భారీగా చేరుకుంటున్నారు. వీరంతా గురువారం ఉదయం నాలుగు గంటలకు నిర్వహించే డోపుకథ, సాయంత్రం ఆరుగంటలకు జరిగే రథోత్సవాన్ని తిలకించనున్నారు.

మద్దుట్ల అటవీ ప్రాంతంలో బాసర సీసీఎఫ్

మల్యాల: మండలంలోని ఒబులాపూర్ సెక్షన్ పరిధి మద్దుట్ల బీట్ అటవీ ప్రాంతాన్ని బుధవారం బాసర జోన్ ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ శర్వానన్ స్థానిక అటవీ శాఖ అధికారులతో కలిసి సందర్శించారు. అటవీ అభివృద్ధి పనులు, నాలా ప్లాంటేషన్, నేచురల్ ఫారెస్ట్‌ను పరిశీలించారు. చారిత్రక ప్రదేశం ఎద్దు ముక్కుల గండిని సందర్శించారు. నీటిగుంతల ఏర్పాట్లను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి వేంకటేశ్వర్‌రావు, కొడిమ్యాల ఎఫ్ఆర్వో లత, సెక్షన్ ఆఫీసర్ రత్నమ్మ, బీట్ ఆఫీసర్ ప్రవీణ్ పాల్గొన్నారు.



నీటి గుంతలను పరిశీలిస్తున్న సీసీఎఫ్ శర్వానన్

ఉచిత విద్యుత్‌కు 'జీరో బిల్లు'

జగిత్యాలజోన్: ఉచిత విద్యుత్ కోసం మార్చి నుంచి జీరో బిల్లు అందిస్తామని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ తెలిపారు. తెల్లరేషన్ కార్డు ఉండి, అర్హులైన వారికి 200 యూనిట్లకు ఉచిత విద్యుత్‌కు జీరో బిల్లు ఉంటుందని తెలిపారు. పథకానికి అర్హులై, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోకపోవడం, సరైన వివరాలు ఇవ్వని వారు, తెల్లరేషన్ కార్డు, విద్యుత్ కనెక్షన్ నంబర్, ఆధార్‌కార్డులతో ఆయా ప్రాంతాల పరిధిలోని ఎంపీడీవో కార్యాలయాల్లో లేదా మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులను అధికారులు పరిశీలించిన తర్వాత విద్యుత్ కార్యాలయానికి పంపిస్తే వారందరికీ గృహజ్యోతి పథకం వర్తింపజేస్తామన్నారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ పరిశీలన పూర్తయ్యేవరకూ బిల్లు వసూలుపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని వివరించారు.

దేవుడి పేరు చెప్పి ఓట్లడిగే సంస్కృతి బీజేపీది



మాట్లాడుతున్న బండ శంకర్, పార్టీ నాయకులు

జగిత్యాలటౌన్: దేవుడి పేరు చెప్పి ఓట్లడిగే నీచ సంస్కృతి బీజేపీదేనని, రామమందిరం నిర్మిస్తే రామరాజ్యం వచ్చినట్లేనా..? అని టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు బండ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు, స్థాయి బోగ శ్రావణికి లేదన్నారు. ఇతర పార్టీల నుంచి గెలిచినవారిని పార్టీలో చేర్చుకుంటున్న సంస్కృతి బీజేపీదని విమర్శించారు. బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరిన శ్రావణికి నిత్యం ప్రజలకోసం తపించే జీవన్‌రెడ్డిని విమర్శించే స్థాయి ఉందా అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ పార్టీలు మారే వ్యక్తి కాదని గుర్తు చేశారు. రాముడి పేరు చెప్పుకుని ఓట్లడగడం మానుకుని, శ్రీరాముడి ఆదర్శ పాలనను అనుసరించాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, ఎలిగేటి నర్సయ్య. నేహాల్, గుంటి జగదీశ్వర్, అనిత తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల రూరల్ ఎంపీపీగా మహేశ్

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులు



మహేష్‌కు ధ్రువీకరణ పత్రం ఇస్తున్న అధికారులు



ఎంపీపీ ఎన్నికకు హాజరైన ఎంపీటీసీలు

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్ ఎంపీపీగా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మంగళారపు మహేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీపీ ఎన్నికకు ప్రత్యేకాధికారి మదన్‌మోహన్ బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మొత్తం 16 మంది ఎంపీటీసీలకు చల్‌గల్ ఎంపీటీసీ మృతి చెందగా.. 15మంది ఉన్నారు. బీఆర్‌ఎస్ నుంచి ఎంపీపీ పదవి కోసం ఇద్దరు పోటీ పడగా.. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ నర్సింగాపూర్ ఎంపీటీసీ మహేశ్‌ను ఎంపిక చేసి, మిగిలిన సభ్యులకు విప్ జారీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో మహేశ్ నామినేషన్ వేయగా.. గుల్లపేట ఎంపీటీసీ దమ్మ సురేందర్ రెడ్డి ప్రతిపాదించారు. అంతర్గాం ఎంపీటీసీ శ్రీనివాస్ బలపరిచారు. పోటీకి ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో మహేశ్ ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం మహేశ్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ ఎస్సై సదాకర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అర్బన్ ఎంపీపీ ఎన్నిక వాయిదా

జగిత్యాల అర్బన్ మండలంలో నలుగురు ఎంపీటీసీలు ఉన్నారు. ఎంపీపీ మ్యాదరి వనిత గతంలో అనారోగ్యంతో మృతి చెందగా.. అప్పటినుంచి ఇన్‌చార్జి ఎంపీపీగా తిప్పన్నపేట ఎంపీటీసీ ములాసపు లక్ష్మి కొనసాగుతున్నారు. ఎంపీపీ పదవి కోసం డీఆర్‌డీఏ పీడీ సంపత్‌రావు బుధవారం ఎన్నిక నిర్వహించారు. ఎస్సీ మహిళగా ఎంపీటీసీలు ఎవరూ లేకపోవడంతో ప్రత్యేకాధికారిని నియమించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.



జగిత్యాల: పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు సందడి



జగిత్యాల: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా



వికలాంగుడిని పరీక్ష కేంద్రానికి తీసుకొస్తూ..



ధర్మపురి:పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- 95.05 శాతం విద్యార్థులు హాజరు

జగిత్యాల/రాయికల్/ధర్మపురి/కొండగట్టు: జిల్లాలో ఇంటర్ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. జిల్లావ్యాప్తంగా 7,270 మంది విద్యార్థులకు 6,945 మంది హాజరయ్యారు. మొత్తంగా 95.05 శాతం నమోదైంది. పరీక్ష కేంద్రాలను కలెక్టర్ యాస్మిన్ బాషా సందర్శించారు. రాయికల్, ధర్మపురి పరీక్ష కేంద్రాలకు కొందరు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో అనుమతించలేదు. కొడిమ్యాలలో నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చల్ల రవీందర్ సహాయకురాలితో పరీక్ష పూర్తి చేశాడు.



ఇబ్రహీంపట్నం: పరీక్షకేంద్రంలోకి వెళ్తూ..



రాయికల్: ఆలస్యంగా వచ్చి కేంద్రం వద్ద..



లీప్ డే..సందడే

- నాలుగేళ్లకోసారి వచ్చే ఫిబ్రవరి 29 స్పెషల్..
- లీపు సంవత్సరంలో పుట్టిన, వివాహం చేసుకున్నవారిలో సంతోషం
- బర్త్‌డే, మ్యారేజ్ డేకు ఏర్పాట్లు

లీప్ ఇయర్ అంటే ఏమిటి?

భూమి సూర్యుని చుట్టూ తిరగడానికి 365 రోజుల 5గంటల 49 నిమిషాల 12 సెకండ్లు పడుతుందని అంచనా. అంటే 365 రోజులతోపాటు మరో పావు రోజు. పావు రోజును లెక్కలోకి తీసుకోలేం కాబట్టి ప్రతీ నాలుగేళ్లలో నాలుగు పావు రోజుల్ని కలిపితే ఒకరోజు అవుతుంది. దీన్ని చేర్చిన ఇయర్‌నే లీప్ ఇయర్‌గా పిలుస్తాం. ఇలా నాలుగేళ్లకోసారి ఫిబ్రవరి నెలలో 28కి బదులుగా 29 రోజులు వస్తాయి.

కోల్‌సిటీ(రామగుండం): సాధారణ సంవత్సరంలో 365 రోజులు, లీపు సంవత్సరంలో 366 రోజులు ఉంటాయి. ఈ ప్రత్యేకమైన ఏడాది మాత్రం ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి. నాలుగేళ్లకోసారి వచ్చే లీప్ ఇయర్ అందరికీ కామన్ అయినా... కొందరికి మాత్రం సమ్‌థింగ్ స్పెషల్. ఫిబ్రవరి 29న పుట్టిన వారిని లీప్లింగ్స్ లేదా లీపర్స్ అని పిలుస్తారు. ప్రపంచంలో ఇలాంటివారు సుమారు 40 కోట్ల మంది ఉన్నారని అంచనా. ఈ రోజున పుట్టినవారు, పెళ్లి చేసుకున్నవారు తమ పుట్టినరోజు, పెళ్లిరోజు వేడుకలు జరుపుకునేందుకు నాలు గేళ్లు ఎదురు చూస్తారు. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం లీప్ డే రానే వచ్చింది. బర్త్ డే, మ్యారేజ్ డేను ఘనంగా జరుపుకునేందుకు పలువురు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నేడు లీప్ డే సందర్భంగా ప్రత్యేక కథనం...

మా కుమారుడి రెండో బర్త్‌డే


నిర్వాన్‌తో తల్లిదండ్రులు ఎల్లేశ్-వనిత

కోల్‌సిటీ: మాది గోదావరిఖని ఎల్బీనగర్. మాకు 2016 ఫిబ్రవరి 29న స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో కుమారుడు జన్మించగా నిర్వాన్ అని పేరు పె ట్టాం. లీప్ ఇయర్ కావడంతో నాలుగేళ్ల క్రితం ఫస్ట్ బర్త్ డే చేశాం. గురువారం రెండో బర్త్‌డే చేసేందుకు ఎదురుచూస్తున్నాం.

– నమిండ్ల ఎల్లేశ్-వనిత, గోదావరిఖని

మొదటి పుట్టినరోజు..


శ్రీయన్‌నందతో తల్లి దండ్రులు మధుకర్-స్రవంతి

కోల్‌సిటీ: మాది రామగిరి మండలంలోని రత్నాపూర్. మాకు 2020 ఫిబ్రవరి 29న కొడుకు పుట్టగా శ్రీయన్‌నంద్ అని పేరు పెట్టాం. నేను జేఎస్టీయాలో, నా భార్య స్రవంతి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తోంది. గురువారం మా కుమారుడి మొదటి పుట్టినరోజు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. చాలా థ్రిల్‌గా ఉంది. 100 మంది నిరుపేద చిన్నారులకు అన్నదానం చేయడానికి హైదరాబాద్‌లోని థాగమ్ ఫౌండేషన్‌కు విరాళం పంపించాం.

– మధుకర్-స్రవంతి

ఎనిమిదో పెళ్లిరోజు..


కుమారుడు, కూతురితో రమేశ్‌బాబు-జ్యోతిలక్ష్మి

ఎలిగేడు(పెద్దపల్లి): మాకు 1992 ఫిబ్రవరి 29 న వివాహమైంది. నేను కిరాణాషాపు నిర్వహిస్తున్న. నా భార్య జ్యోతిలక్ష్మి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. కుమారుడు వైభవ్, కూతురు వైష్ణవి ఉన్నారు. మా 32 ఏళ్ల వివాహ జీవితంలో గురువారం ఎనిమిదో పెళ్లిరోజు జరుపుకుంటున్నాం. సంతోషంగా ఉంది.

– రమేశ్‌బాబు-జ్యోతిలక్ష్మి, ఎలిగేడు

నేటితో 64 ఏళ్లు..


భర్త రాజిరెడ్డితో లక్ష్మి

విద్యానగర్(కరీంనగర్): మేము కరీంనగర్‌లోని సప్తగిరికాలనీలో ఉంటాం. నా పుట్టిన రోజు నాలుగేళ్లకోసారి వస్తుందని తెలియదు. మా మనవడు నా స్కూల్ సర్టిఫికెట్లు ఒకసారి చూసినప్పుడు నేను ఫిబ్రవరి 29, 1960న పుట్టినట్లు తెలిసింది. అప్పటి నుంచి కుటుంబసభ్యులందరూ గుర్తుపెట్టుకొని, నాలుగేళ్లకోసారి పుట్టిన రోజు శుభాకాంక్షలు చెబుతున్నారు. ఈ గురువారంతో నాకు 64 ఏళ్లు నిండుతాయి. మా ఆయన రాజిరెడ్డి, కుటుంబసభ్యులు వేడుకలకు ఏర్పాట్లు చేశారు.

– ముస్కుల లక్ష్మి, సప్తగిరికాలనీ, కరీంనగర్

ఈ రోజు మా పెళ్లి..



బోయినపల్లి(చొప్పదండి): ఈ రోజు మా పెళ్లి.. లీప్ ఇయర్ ఫిబ్రవరి 29న దాంపత్య జీవితంలోకి అడుగు పెడుతుండటం ఆనందంగా ఉంది. మా ఇద్దరిదీ ఒకే ఊరు బోయినపల్లి మండలంలోని తడగొండ. నాలుగేళ్లకోసారి పెళ్లిరోజు వస్తుందని తెలిసి, కొత్త అనుభూతి కలుగుతోంది.

– తేజసీ-ప్రదీప్‌రెడ్డి, తడగొండ, బోయినపల్లి

మరిచిపోలేనిది..


దువ్వాక మల్లేశం-స్వప్న, రాయికల్

రాయికల్(జగిత్యాల): మాది రాయికల్. మా వివాహం 29-02-2004న జరిగింది. నాలుగేళ్లకోసారి మా పెళ్లిరోజు నిర్వహించుకోవడం జీవితంలో మరిచిపోలేనిది. ఈ రోజు అనాథలకు భోజనం పెడతాం. మా కుమారుడు మల్లికార్జున్, కూతురు తేజస్విని పుట్టిన రోజు కూడా ఇదే నెల 5, 28వ తేదీలు.

ముహూర్తం మళ్లీ రాదని..



తిమ్మాపూర్(మానకొండూర్): మాది తిమ్మాపూర్ మండలంలోని మొగిలిపాలెం. నేను భూపాల్‌పల్లి ఎంఈవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నాకు సైదాపూర్ మండలంలోని అగ్రహారం కుర్మపల్లి చెందిన మనస్వితో పెళ్లి నిశ్చయమైంది. గురువారం నాటి ముహూర్తం మళ్లీ రాదని పండితులు చెప్పడంతో వివాహం చేసుకుంటున్నాను.

శివరాసన్-మనస్వి, మొగిలిపాలెం, కుర్మపల్లి

అప్పట్లో మాకు తెలియదు..



విద్యానగర్(కరీంనగర్): మా పెళ్లి లీప్ ఇయర్‌లో జరుగుతోందని, నాలుగేళ్లకోసారి పెళ్లిరోజు జరుపుకుంటామని అప్పట్లో మాకు తెలియదు. ఆరోజు మంచి రోజు ఉందని ఫిబ్రవరి 29, 1964న పెద్దలు వివాహం చేశారు. తర్వాత తెలిసింది మా మ్యారేజ్ డే ప్రతీ సంవత్సరం రాదని. మాది సిరిసిల్ల. నేను సిరిసిల్ల శాంతినగర్‌లోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్‌గా జూన్ 2000లో రిటైరయ్యాను. గురువారం మా పెళ్లి రోజు. వివాహమై, 60 ఏళ్లవుతున్న సందర్భంగా మా మనవళ్లు, మనవరాళ్లు షష్టి పూర్తి చేస్తున్నారు.

చిట్నేని శ్రీనివాసరావు-నీరజ, సిరిసిల్ల

36 ఏళ్లు.. తొమ్మిదో పుట్టిన రోజు


కుటుంబసభ్యులతో సందీప్

కోరుట్ల: మాది కోరుట్ల. నేను లీపు సంవత్సరం ఫిబ్రవరి 29, 1988లో జన్మించాను. అప్పటినుంచి ఈరోజు వరకు లెక్కతీస్తే సరిగ్గా తొమ్మిదో పుట్టిన రోజు జరుపుకోబోతున్న. నాన్న లక్ష్మీనారాయణ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రిటైరయ్యారు. అమ్మ స్వరూప. నేను ఎంటెక్ పూర్తి చేసి, ప్రస్తుతం ముంబయిలో ఉద్యోగం చేస్తున్న. నాలుగేళ్లకోసారి వచ్చే పుట్టినరోజును కుటుంబసభ్యులు, స్నేహితుల మధ్య జరుపుకుంటున్న. ఈసారి అమ్మానాన్న, బంధువులు రెండు రోజుల ముందే నా వద్దకు వచ్చారు.

– తుంగూరి సందీప్‌కుమార్, కోరుట్ల

వయసు 16.. బర్త్‌డే నాలుగోది



గంగాధర(చొప్పదండి): నా వయస్సు 16 ఏళ్లు. బర్త్‌డే మాత్రం నాలుగోదే. మాది గంగాధర మండలంలోని ఉప్పరమల్యాల. నేను 29 ఫిబ్రవరి 2008న జన్మించాను. అందరికన్నా భిన్నంగా నాలుగేళ్లకోసారి జన్మదిన వేడుకలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది.

– దోమకొండ వర్షిణి, ఉప్పరమల్యాల, గంగాధర

మ్యారేజ్ డేకు మస్కట్ నుంచి వస్తా..



కథలాపూర్(వేములవాడ): మాది కథలాపూర్ మండలంలోని చింతకుంట. 2004 ఫిబ్రవరి 29న సంధ్యారాణిని పెళ్లి చేసుకున్న. నేను మస్కట్‌లో ఉంటున్న. నాలుగు సంవత్సరాలకోసారి వచ్చే పెళ్లి రోజును స్వగ్రామం వచ్చి, కుటుంబసభ్యులు, బంధుమిత్రుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉంటుంది.

– చెదలు ప్రసాద్, చింతకుంట, కథలాపూర్

ఏటా జరుపుకునే చాన్స్ లేదు



అందరూ ఏటా తమ పుట్టిన రోజు జరుపుకుంటారు. కానీ నాకు ఆ చాన్స్ లేదు. నా బర్త్‌డే లీప్ డే కావడంతో ఎదురుచూస్తూ ఉంటా. ఒక్కోసారి అందరిలా ఏడాదికోసారి జరుపుకుంటే బాగుండు అనిపిస్తుంది. కానీ, నాలుగు సంవత్సరాలు వేచిచూడటం ప్రత్యేకం అనుకుంటాను. నేను రాయికల్ బాలుర ఉన్నత పాఠశాలలో బయోసైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను.

– ఏనుగు రజిత, స్కూల్ అసిస్టెంట్, రాయికల్

నేడు ఏడడుగులు వేస్తున్నాం..


సాయిచంద్-శిశరూప

గంగాధర(చొప్పదండి): ముహూర్తం కలిసి రావడంతోపాటు ఫిబ్రవరి 29న పెళ్లి చేసుకోవడం ప్రత్యేకంగా ఉంటుందని ఈ రోజు మేము ఏడడుగులు వేస్తున్నాం. మాది గంగాధర మండలంలోని ఉప్పరమల్యాల. ఉద్యోగరీత్యా జర్మనీలో ఉంటున్న. హైదరాబాద్‌కు చెందిన శిశరూపను గురువారం పెళ్లి చేసుకుంటున్న.

– గౌరిశెట్టి సాయిచంద్-శిశరూప, గంగాధర

అందరికీ ఇన్విటేషన్ ఇచ్చాం..



సప్తగిరికాలనీ(కరీంనగర్): మా వివాహం 2004 ఫిబ్రవరి 29న జరిగింది. మొదటి పెళ్లిరోజు జరుపుకునేందుకు నాలుగేళ్లు పట్టింది. చాలా గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకున్నాం. గురువారం ఐదో పెళ్లి రోజు. చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. వేడుకలకు రెడీ అయ్యాం. అందరికీ ఇన్విటేషన్ ఇచ్చాం.

– కోదూరి రజని-సత్యనారాయణ, కోతిరాంపూర్, కరీంనగర్

2020లో అమ్మతో కేక్ కట్ చేశా..



సప్తగిరికాలనీ(కరీంనగర్): మా సొంతూరు వేములవాడ. కానీ, కరీంనగర్‌లో నివాసం ఉంటున్నాం. ప్రస్తుతం కోతిరాంపూర్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. 1972 ఫిబ్రవరి 29న పుట్టాను. ఇప్పటివరకు 13 సార్లు బర్త్‌డే జరుపుకున్న. 2020లో మా అమ్మతో కలిసి బర్త్ డే కేక్ కట్ చేశా. ఇప్పుడు అమ్మ లేదు. బాధగా ఉంది.

– రాగంపేట చంద్రశేఖర్‌రావు, కరీంనగర్

నేడు ఒక్కటవుతున్నాం..



విద్యానగర్(కరీంనగర్): ఈరోజు మంచి రోజు అని ముహూర్తం నిర్ణయించి, పెళ్లి చేస్తున్నారు. మా ఊరు సుల్తానాబాద్ దగ్గర ముప్పిరితోట. అమ్మాయిది కరీంనగర్. నేను ఛత్తీస్‌గఢ్‌లోని ఎన్టీపీసీలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాను. మాది పెద్దలు కుదిర్చిన వివాహమే. గురువారం తీగలగుట్టపల్లిలోని రంగినేని గార్డెన్స్‌లో పెళ్లితో ఒక్కటవుతున్నాం.

భరత్‌కుమార్ గౌడ్- కావ్యశ్రీఫణి

నేడు మా వివాహం..


శివాణి-సతీశ్

బోయినపల్లి(చొప్పదండి): అనుకోకుండా లీపు సంవత్సరం ఫిబ్రవరి 29వ తేదీనే మా వివాహం జరుగుతుండటం థ్రిల్లింగ్‌గా ఉంది. మాది గంగాధర మండల కేంద్రం. శివాణిది బోయినపల్లి మండలంలోని దేశాయిపల్లి గ్రామం. మేము మా పెళ్లిరోజును నాలుగేళ్లకోసారి గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటాం.

– శివాణి-ఇప్పలపల్లి సతీశ్, దేశాయిపల్లి, గంగాధర

29వ తేదీనే ఎంచుకున్నాం..



కోల్‌సిటీ(రామగుండం): మాది గోదావరిఖని మార్కండేయకాలనీ. ప్రస్తుతం కరీంనగర్‌లో ఉంటున్నాం. నేను గణిత శాస్త్రంలో విద్యార్థులకు శిక్షణనిస్తున్నాను. 1992లో మాధవిని పెళ్లి చేసుకున్న. ఫిబ్రవరి 27, 29 తేదీలు మంచి రోజులని పండితులు చెప్పారు. మేము లీప్ డే అంటే వెరైటీగా ఉంటుందని 29ని ఎంచుకున్నాం. నాలుగేళ్లకోసారి వచ్చే పెళ్లిరోజును సంతోషంగా జరుపుకుంటున్నాం.

– ఆయంచ జవహర్‌బాబు-మాధవి, గోదావరిఖని

మా పాప బర్త్‌డే ప్రత్యేకం


ఆరాధ్యను ఆశీర్వదిస్తున్న తల్లిదండ్రులు (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): మాది ధర్మారం మండలం కొత్తూరు. మా కూతురు ఫిబ్రవరి 29న జన్మించింది. నాలుగేళ్లకోసారి బర్త్‌డేను ఘనంగా జరుపుతున్నాం. గురువారం రెండో పుట్టిన రోజు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం.

– నెరువట్ల మహేందర్-శ్రీలత, కొత్తూరు

అందరికీ గుర్తుంటుంది..



కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మాది పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్. నా వివాహం జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామానికి చెందిన వడ్లకొండ స్నేహతో నిశ్చయమైంది. పెళ్లి యాధృచ్ఛికంగా గురువారమే నిశ్చమైంది. లీప్ డే కావడంతో మా పెళ్లిరోజు బంధుమిత్రులందరికీ గుర్తుంటుంది.

– గోలి హరీశ్-స్నేహ, కాల్వశ్రీరాంపూర్, చెప్యాల

52వ యేట.. టీనేజ్‌లోకి..


బర్త్‌డే కేక్‌తో రమణకుమార్

మంథని: మాది మంథని. నేను న్యాయవాద వృత్తిలో ఉన్నాను. 1972 ఫిబ్రవరి 29 జన్మించాను. గురువారం 13వ బర్త్‌డే జరుపుకుంటున్న. 52వ యేట.. టీనేజ్‌లోకి అడుగుపెడుతున్నానని సంతోషంగా ఉంది. పుట్టినరోజు వేడుకను కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితుల సమక్షంలో జరుపుకుంటా.

– చంద్రుపట్ల రమణకుమార్‌రెడ్డి, మంథని

తండ్రిపై తనయుడి కత్తితో దాడి


చికిత్స పొందుతున్న బాధితుడు


మెట్‌పల్లిరూరల్: కుటుంబ కలహాలతో తండ్రిపై తనయుడు కత్తితో దాడికి పాల్పడిన ఘటన మెట్‌పల్లి మున్సిపల్ పరిధి ఆరపేటలో జరిగింది. గ్రామానికి చెందిన రిజ్వాన్‌ఖాన్‌కు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు అక్బర్‌ఖాన్‌కు భార్యతో విభేదాలు రావడంతో కొంతకాలంగా ఆమె పుట్టింట్లోనే ఉంటోంది. భార్య విషయమై ఇంట్లో పలుమార్లు గొడవలు చోటుచేసుకుంటున్నాయి. బుధవారం కూడా మరోమారు గొడవ తలెత్తింది. మాటమాటా పెరగడంతో అక్బర్‌ఖాన్ తల్లిపై కత్తితో దాడి చేసేందుకు యత్నించాడు. అక్కడే ఉన్న తండ్రి అడ్డుకోగా.. అతడిపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో రిజ్వాన్‌ఖాన్‌కు ఛాతికింది భాగంలో, వీపులో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రిజ్వాన్‌ఖాన్ పెద్దకుమారుడు జుబైర్‌ఖాన్ ఫిర్యాదు మేరకు అక్బర్‌ఖాన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

నాచుపల్లి జేఎన్టీయూ సమీపంలో అగ్ని ప్రమాదం


మంటలను ఆర్పుతున్న సిబ్బంది

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం నాచుపల్లి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని అడవి ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి మంటలు చెలరేగుతున్నాయి. బుధవారం మధ్యాహ్నం మంటలు కళాశాల సమీపంలోని గెస్ట్‌హౌస్ వరకు వ్యాపించడంతో అక్కడే ఉన్న సిబ్బంది ఫైరింజన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. సమీపంలో ప్రహరీ లేకపోవడంతో మంటలు కళాశాల వరకు వ్యాపించాయి.

అప్పుల బాధతో వృద్ధుడి ఆత్మహత్య


దేవయ్య (ఫైల్)

కొండగట్టు: అప్పుల బాధతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొడిమ్యాల మండలం నమిలికొండలో బుధవారం చోటుచేసుకుంది. కొడిమ్యాల ఎస్సై సందీప్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన బోలుమల్ల దేవయ్య(61) కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురయ్యాడు. బుధవారం వేకువజామున వెటర్నరీ సెంటర్ సమీపంలో ఉరేసుకుని కనిపించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

మల్లాపూర్: మద్యానికి బానిసైన మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన పెడికం వెంకటేశ్ (38) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం భద్రాదికొత్తగూడెం జిల్లాకు చెందిన వెంకటేశ్ తొమ్మిదేళ్ల క్రితం భార్య గంగమణితో కలిసి గ్రామానికి వలస వచ్చాడు. మద్యానికి బానిసయ్యాడు. భార్య మందలిస్తున్నా మార్పు రాలేదు. మంగళవారం రాత్రి మద్యం తాగి వచ్చాడు. భార్య వారించగా.. ఇకపై మద్యం తాగనని చెప్పి బయటకు వెళ్లి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గంగమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

కాంగ్రెస్ నిరసనలో జిల్లా నేతలు

మల్లాపూర్: రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి చేపట్టిన నిరసనలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. మోదీ హటావో.. కిసాన్‌కు బచావో నినాదం చేశారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి, ఉపాధ్యక్షుడు దామెర రాజశేఖరెడ్డి, ప్రధాన కార్యదర్శి గజ్జి రమేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భార్యను హతమార్చిన భర్త


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): కట్టుకున్న భార్యను మంచంపై పడేసి హతమార్చిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మెట్‌పల్లి మండలం మేడిపల్లి గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుంట బూదమ్మ, శ్రీనివాస్ దంపతులు. సంతానం లేకపోవడంతో ఓ బాబును 13 ఏళ్ల క్రితం దత్తత తీసుకున్నారు. కొద్దిరోజులుగా బూదమ్మ (56) ఆరోగ్యం సరిగా లేదు. భర్త శ్రీనివాస్ ఇటీవలే ఆమెకు హైదరాబాద్‌లో శస్త్ర చికిత్స చేయించాడు. అప్పటినుంచి బూదమ్మ మంచానికే పరిమితంకావడంతో శ్రీనివాస్ సపర్యలు చేస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి శ్రీనివాస్‌ను బూదమ్మ నిద్రలేపగా.. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. బూదమ్మ మంచంపై నుంచి కింద పడగా.. శ్రీనివాస్ ఆమెను మంచంపై బలంగా ఎత్తేశాడు. ఘటనలో మంచం హెడ్ బోర్డు ఆమె తలకు గట్టిగా తాకి అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటన స్థలాన్ని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ లక్ష్మీనారాయణ పరిశీలించారు. బూదమ్మ వదినె కుంట రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అనిల్ తెలిపారు.

విద్యానగర్‌లో రెండిళ్లలో చోరీ

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో మంగళవారం రాత్రి దొంగలు రెండిళ్లలో చోరీకి పాల్పడ్డారు. విద్యానగర్‌కు చెందిన హన్మంతరావు, మరో వ్యక్తి ఇంటికి తాళాలు వేసి కొద్దిరోజుల క్రితం విదేశాలకు వెళ్లారు. దీంతో దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలు తెరిచి సామగ్రిని చిందరవందర చేశారు. పొరుగింటి వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ ఎస్సై మన్మథరావు దొంగతనం జరిగిన ఇళ్లను పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. ఇంటి యజమానులు అందుబాటులో లేకపోవడంతో వివరాలు తెలియరాలేదు.